క్లుప్తంగా

జేఈఈలో ప్రతిభ



మరడాన తులసి

గరుగుబిల్లి: జేఈఈ మెయిన్స్‌లో మండలంలోని సుంకి గ్రామానికి చెందిన మరడాన తులసి ప్రతిభ కనబరించింది. ఫిజిక్స్‌లో 88.83 శాతం, కెమిస్ట్రీలో 80.88 శాతం, మేథ్స్‌లో 99.17 శాతం మార్కులతో మొత్తంగా 94.35శాతం మార్కులు సాధించింది. తల్లిదండ్రులు సురేష్, నాగమణితో పాటు గ్రామస్తులు ఆమెను అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక



భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

జియ్యమ్మవలస: ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరీక్షిత్‌రాజు దంపతులకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎంపీ అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పుష్పశ్రీవాణి దంపతులు ఆమెను సత్కరించారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశా వర్కర్లుగా గుర్తించాలి



సామూహిక దీక్షలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

సీతంపేట: కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించి వారికి నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని సీహెచ్‌డబ్ల్యూలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు కోరారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన



శాస్త్రీయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం కేవీకే సమన్వయకర్త డా. టి.ఎస్.ఎస్.కె.పాత్రో ఆధ్వర్యంలో 40వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్సన్ డా. బి.ముకుందరావు, సహా పరిశోధనా సంచాలకులు డా. ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర సస్యరక్షణ విధానాలు, మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా. శ్రీనివాసరాజు, డా. అమృతవీణ, డా. స్రవంతి, డా. ఎం.అనంతవిహారి, రైతులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు తరలింపు



కంటి ఆపరేషన్లకు వెళ్తున్న వృద్ధులు

గుమ్మలక్ష్మీపురం: అంతర కుసుమం, కొయ్యకండ వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న 15 మందిని శస్త్రచికిత్సల కోసం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి బుధవారం తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కంటి వెలుగు సెల్ వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురిని గుర్తించి ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లతో పాటు భోజనం, వసతి, రవాణ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందించనున్నట్లు తెలిపారు. కంటి వైద్య సహాయకులు శైలజ, ఆశా కార్యకర్తలు రోగుల వెంట వెళ్లారు.

ప్రగతి పథంలో పెద్దూరు

- ఒకే చోట గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం
- సంక్షేమ పథకాల రూపంలో రూ.6.98 కోట్లు లబ్ధి
- గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



రైతు భరోసా కేంద్రం



హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం



గ్రామ సచివాలయం

సీతంపేట: ఏజెన్సీలోని కొత్తగా ఏర్పడిన పెద్దూరు పంచాయతీ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పెద్దూరు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్పు చెందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్టు కనబడుతున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో కారిగూడ, మర్రిగూడ, బొంగుడుగూడ, గాంధీగూడ, వలగెడ్డ ఏడీఎంగూడ, వలసగూడ, చింతమానుగూడ, బుగతగూడ గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల పరిధిలో అర్హులైన 2820 మంది లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ.6.98 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 769 మందికి రూ.1.09 కోట్లు లబ్ధి జరిగింది.

అభివృద్ధికి బాటలు..

గత ప్రభుత్వం హయంలో కనీస సౌకర్యాలు లేని తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.30 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.25 లక్షలతో విలేజ్ హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని ఒకే చోట నిర్మించారు. అడ్డంగి, అద్దాలమామిడి, బుగతగూడ, గాంధీగూడల్లో మినీరక్షిత పథకాలు ఏర్పాటు చేశారు. అలాగే రూ.10 లక్షలతో గ్రామదేవత గుడి నిర్మాణ పనులు చేపడుతున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా రూ.40 లక్షల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వివిధ పథకాల కింద లబ్ధిపొందిన వారి వివరాలు	
పథకం	లబ్ధిదారులు
వైఎస్సార్ ఆసరా	249
అమ్మ ఒడి	363
జగనన్న చేదోడు	8
కోవిడ్ సాయం	413
క్రాప్ ఇన్సూరెన్స్	1
హౌసింగ్	23
జగనన్న తోడు	18
జగనన్న వసతిదీవెన	77
జగనన్న విద్యాదీవెన	96
కళ్యాణమస్తు	1
వైఎస్సార్ కాపునేస్తం	4
వైఎస్సార్ పింఛన్ కానుక	280
వైఎస్సార్ రైతు భరోసా	391
సున్నావడ్డీ (పంట రుణాలు)	97
సున్నా వడ్డీ (డ్వాక్రా సంఘాలకు)	418
వైఎస్సార్ వహన మిత్ర	11
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	89
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	145
వైఎస్సార్ బీమా	5
జగనన్న చేయూత	131
మొత్తం	2820

అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మించి ప్రజలకు సేవలందిస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు కేటాయించడంతో ఆ నిధులతో పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

– హిమరక ఆదిలక్ష్మి, సర్పంచ్, పెద్దూరు

అభివృద్ధిని చూసి మాట్లాడండి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- లోకేష్‌పై విరుచుకుపడిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించిన శంఖారావం సభలో నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఎద్దేవా చేశారు. చినమేరంగిలోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏ కార్యక్రమం నిర్వహిస్తున్నామో కూడా లోకేష్‌కు తెలిసినట్లు లేదని, ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదివి అబాసు పాలయ్యారని అన్నారు. లోకేష్ మాట్లాడిన ప్రతీ మాటలో వాస్తవం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, రాష్ట్రమంతా లబ్ధిదారులు సంబరాలు చేసుకుంటుంటే.. లోకేష్‌కు అవేవీ పట్టనట్లుందన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మాత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమ అవుతోందన్నారు. ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేసిన ఘనత టీడీపీదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 1.30 లక్షల మందికి గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించామని, 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చామని, ప్రస్తుతం 6100 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఇవి కాక ఆరోగ్యశాఖలో వేలాది పోస్టులు భర్తీ చేసినట్లు చెప్పారు. ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని నిలదీశారు. నాపైన, నాభర్త పరీక్షిత్‌రాజు, నామరిది రమేష్‌బాబుపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని లోకేష్‌కు హితవు పలికారు. ఆమెతో పాటు ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, మొండెఖల్లు ఎంపీటీసీ విద్యారాణి, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు అంధవరపు కోటీశ్వరరావు ఉన్నారు.

కష్టం విలువ తెలిసిన నాయకుడు జగన్



తనీష్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: కష్టం విలువ తెలిసిన నాయకుడు సీఎం జగన్ అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన రణస్థలం ఉదయకుమార్, దేవి దంపతుల కుమారుడు తనీష్‌కు ఆరోగ్యం బాగులేకపోవడంతో చిన్నారి వైద్య ఖర్చులకు కోసం సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బుధవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. నియోజకవర్గంలో అనేక మందికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్ ఇన్‌చార్జి జి.భాగ్యలక్ష్మి, ఎంపీపీలు బి.భాను, డి.వెంకటరమణనాయుడు, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, రణస్థలం రాంబాబు, బంకి లక్ష్మణమూర్తి, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులున్నారు.

త్వరితగతిన జలజీవన్ పనులు



మాట్లాడుతున్న డీఈఈ నాగేశ్వరరావు

గరుగుబిల్లి: జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నాగేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీటిని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటుచేసిన కమిటీలకు నిర్మాణ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను కమిటీ సభ్యుల తీర్మాణంతో ఖర్చు చేయాల్సి ఉందన్నారు. పంచాయతీ నుంచి 9 మంది సభ్యులతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ మెంబర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా కమిటీలో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీశంకరరావు, తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

భామిని: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారంలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన, ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మండల సమావేశంలో సభ్యులు విద్యుత్ సమస్యలపై అధికారులను నిలదీశారు. మండల సమావేశాలకు ట్రాన్స్‌కో అధికారులు హాజరు కాకపోవడంతో వారి పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందని ప్రత్యేక ఆహ్వానితులు టి.సింహాచలం, కె.చిరంజీవులు అన్నారు. భూ హక్కు-భూ సర్వేలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు మండిపడ్డారు. ఉపాధిహామీ పథకం మస్తర్ల నమోదులో తప్పులను క్షేత్రస్థాయి సిబ్బంది సరిగా పరిశీలించడం లేదని జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్ అన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో డీటీ నిమ్మల శేఖరం, డాక్టర్ సోయల్, ఏపీఓ తులసీదాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలి



గారమ్మ కాలనీ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లకు సూచనలు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన పన్ను బకాయిలు సకాలంలో వసూలు అయ్యేలా సచివాలయ యంత్రాంగం దృష్టి సారించాలని నగరపంచాయతీ మేనేజర్ టి.జయరామ్ అన్నారు. పట్టణంలోని సచివాలయాలను ఆర్‌ఐ కె.గజపతిరావుతో కలిసి బుధవారం సందర్శించారు. ఆయా సచివాయాల పరిధిలో రావాల్సిన ఇంటి, ఆస్తి పన్నుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. వలంటీర్లతో సమన్వయం చేసుకొని నిర్ణీత గడువులోగా బకాయిలు వసూలు చేయాలని సూచించారు. సచివాయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల తాజా స్థితిగతులను అడ్మిన్ సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

కురుపాం: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారంపై డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీఓ కురుపాం తాలూక అధ్యక్షుడు ఎస్.ఎస్.ప్రకాశరావు, ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, ఎ.సత్యనారాయణ, ఎస్.రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులతో జేఏసీ చేపట్టిన చర్చలు సఫలం కాకపోవడంతో తదుపరి కార్యాచరణగా దశల వారీ ఆందోళనలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రజారోగ్య భద్రత ప్రభుత్వానిదే..



వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్:

ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదే అని నగరపంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాపరావు, కౌన్సిలర్లు కోడెం సాయికృష్ణ అన్నారు. రామాకళామందిర్ సచివాలయం పరిధి కోమటిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నతేజ్ నేతృత్వంలో 410 మందికి వైద్య సేవలందించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పర్యవేక్షించారు.

పశువిజ్ఞాన బడులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువిజ్ఞాన బడులను రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్థక శాఖ ఎ.డి సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం సీతానగరం మండలంలోని బగ్గందొరవలస పశువైద్య కేంద్రాన్ని తనిఖీచేసిన అనంతరం గ్రామంలోని పాడిరైతులు, గొర్రెలు, మేకలపెంపకం దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధులు ఆశించే ముందు చేయాల్సిన ప్రథమ చికిత్స విషయాలపై వైద్యాధికారులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీఓ సంఘం నాయకులు

పాలకొండ: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ వరహాలుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ నాయకులు లిల్లీ పుష్పనాథం, ఈశ్వరరావు, వాసుదేవరావు, అవినాష్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మె-గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు మండంగి రమణ, సన్యాసిరావు, రాజారావు, బిడ్డిక అడిత్తో తదితరులు కోరారు. ఈమేరకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం వారు సమ్మె-గ్రామీణ బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపర్చాలని, భూ హక్కుల చట్టం 22ను, అటవీ హక్కుల చట్టం సవరణను ఉపసంహరించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 2014 విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు పర్చాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

నూతన బస్‌షెల్టర్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘం పరిధి కొత్తవలస ప్రధాన రహదారిలో గల బస్టాండ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బుధవారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి, ఇతర సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు



విజ్ఞాన భారతి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



కురుపాం జెడ్పీహెచ్ఎస్‌లో సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు

వసంత పంచమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహానికి విద్యార్థులు, హెచ్‌ఎం తోట శంకరరావు, ఉపాధ్యాయులు పూజలు నిర్వహించారు. విజ్ఞాన భారతి పాఠశాలలో 40 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు.

కురుపాం